సమాజానికి సంజీవని యోగా

అంతర్జాతీయ యోగా దినోత్సవంలో వక్తలు

సీతంపేట: చిన్న నాటి నుంచే యోగా సాధన చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చని పలువురు వక్తలు పేర్కొన్నారు. నియోజకవర్గంలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ హైస్కూల్‌లో బుద్ధ యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వలంటీర్ పద్మిని విద్యార్థుల చేత సూర్య నమస్కారాలు, కొన్ని యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం లక్ష్మీ నరస మాట్లాడుతూ యోగా వల్ల పిల్లల్లో శారీరక మానసిక ఉత్తేజం కలుగుతుందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ భారతీయ యోగాను విశ్వవ్యాప్తం చేశారని, ప్రతి ఏటా అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహిస్తున్నారన్నారు. ఈ ఏడాది న్యూయార్క్‌లోని ఐక్య రాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో వివిధ దేశాల ప్రతినిధులతో కలిసి యోగా దినోత్సవం జరుపుకోవడం భారతీయులందరికీ గర్వకారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు ఆర్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఎం.ఎస్.వి.విశ్వనాథం, మాణిక్యం, రామలక్ష్మి పాల్గొన్నారు.

బుల్లయ్య కాలేజీలో యోగాసనాలు

లంకపల్లి బుల్లయ్య కళాశాలలో శ్రీరామచంద్ర మిషన్, హార్ట్‌ఫుల్ నెస్ సంస్థ యోగా ట్రైనర్ పద్మ లీలా యోగా ప్రాముఖ్యాన్ని వివరించి, విద్యార్థులు, అధ్యాపకులతో ప్రాణాయామం, యోగాసనాలు చేయించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సోమేశ్వరరెడ్డి, డీన్స్, విభాగాధిపతులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ క్యాడెట్లు పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతతకు ఉత్తమ మార్గం

మురళీనగర్: ప్రతి రోజూ యోగా సాధన చేయడం వల్ల ఆరోగ్య జీవన యోగం కలుగుతుందని యోగా టీచర్లు ఎంజీ శంకరనారాయణ్, సురవరపు సుబ్బారావు అన్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ మురళీనగర్ శాఖ ఆధ్వర్యంలో మురళీనగర్ స్కేటింగ్ పార్కులో యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి ఉరుకులు, పరుగుల జీవితంలో శారీరక, మానసిక ప్రశాంతతకు యోగా ఒక్కటే ఉత్తమ మార్గమని వివరించారు. ప్రతి రోజూ సూర్యనమస్కారాలు చేయాలని, యోగాతోపాటు ధ్యానం మిళితం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా 2.30 గంటల పాటు నిర్వహించిన యోగాసనాల కార్యక్రమంలో స్థానికులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. యోగాసనాలు వేసిన వారికి అంబలి, మొలకలు, ఫ్రూటీలు అందజేశారు. స్కేటింగ్ పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, కార్యదర్శి పి.నాగరాజు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి ఆలపాటి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

ప్రపంచానికి గురువు

మురళీనగర్ వాకర్స్ పార్కు ప్రాంగణంలో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి మాట్లాడుతూ ప్రపంచానికి భారత్ యోగా గురువుగా గుర్తింపు పొందిందన్నారు. యోగా గురువు తామాడ వెంకటరమణ వాకర్స్‌తో యోగాసనాలు చేయించి, ఆసనాల ప్రాధాన్యాన్ని వివరించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ కార్యదర్శి కె.ద్వారకానాథ్, పూర్వాధ్యక్షుడు నిమ్మగడ్డ బుచ్చయ్య(90), క్లబ్ కార్యదర్శి ఎల్.వి.సుధాకర్ పాల్గొన్నారు.

మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలు ఉత్సాహంగా యోగాసనాలు వేశారు. క్లబ్ అధ్యక్షురాలు, యోగా టీచర్ మంగళంపల్లి శేషామణి మాట్లాడుతూ యోగా నిత్య జీవితంలో ఒక భాగం కావాలన్నారు. ప్రతి రోజూ కనీసం అరగంట నడకతోపాటు 10 నిమిషాలు ప్రాణాయామం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా శేషామణిని క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి, ఎం.శేషామణి, ఎస్.పుష్పలత, పూర్వ అధ్యక్షులు కె.మాధవి, డి.శిరీష, కోశాధికారి లక్ష్మి, ఉపాధ్యక్షులు వరలక్ష్మి, జాలీ వాకర్ మాధవీలత, జయశ్రీ, మహాలక్ష్మి, పూర్ణిమ, జి.లక్ష్మి, సుభాషిని, యశోద, కృష్ణవేణి, రాధ, గీతా భాను, అఫ్సర్ ఖాన్ పాల్గొన్నారు.

కేఎస్ఆర్ గ్రీన్ అపార్ట్‌మెంట్‌లో..

మురళీనగర్ కేఎస్ఆర్ గ్రీన్ అపార్ట్‌మెంట్ వద్ద బోధి యోగా ఇంటర్నేషనల్ స్కూల్ ప్రతినిధులు గాయత్రి, శరణ్య ఆధ్వర్యంలో నివాసులు సూర్యనమస్కారాలు వేశారు. బి.సూర్యనారాయణ మాస్టార్ సమన్వయకర్తగా వ్యవహరించారు.

వాల్తేరు డివిజన్‌లో ఉత్సాహంగా..

విశాఖ స్పోర్ట్స్: ఈకో రైల్వే వాల్తేర్ స్పోర్ట్స్ ఎరీనాలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈకార్వో అధ్యక్షురాలు పారిజాత సత్పతి పలు ఆసనాలు ప్రదర్శించారు. ఉదయం ఆరు గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమంలో వాల్తేరు డివిజన్‌లోని పలువురు ఔత్సాహికులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి ప్రారంభించి మాట్లాడుతూ మానసిక, శారీరక ఆరోగ్యంతోపాటు ఆధ్యాత్మిక శ్రేయస్సుతో ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంభించడానికి యోగా ఉపయుక్తం అన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు సుధీర్‌కుమార్‌గుప్తా, మనోజ్‌కుమార్ సాహు, పర్సనల్ ఆఫీసర్ రంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన యోగా శిబిరాల్లో బ్రాంచ్ మేనేజర్లు, సిబ్బంది, ట్రైనీలు, క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని యోగాసనాలు వేశారు.



మురళీనగర్ స్కేటింగ్ పార్కులో యోగా చేస్తున్న స్థానికులు



బుల్లయ్య కళాశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



ఎన్జీజీవోస్ కాలనీ హైస్కూల్‌లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



మురళీనగర్ పార్కులో యోగాసనాలు వేస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు



యోగా గురువు శేషామణిని సత్కరిస్తున్న మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు



కేఎస్ఆర్ అపార్ట్‌మెంట్‌లో యోగాసనాలు వేస్తున్న నివాసులు




రైల్వే స్పోర్ట్స్ ఎరీనాలో యోగా సాధనలో అధికారులు, చిన్నారులు, ఔత్సాహికులు

క్లుప్తంగా

కాటమ్మవారికి ఘనంగా పూజలు

సీతమ్మధార: పీ అండ్ టీ కాలనీలో కొలువైన శ్రీ కాటమ్మ అమ్మవారి ఆలయ పదో వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు.

అమ్మవారికి ఉదయం పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు. కాటమ్మను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శినం కల్పించారు. ఈ సందర్భంగా పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. శ్రీ కాటమ్మ, శ్రీ నాగమ్మ అమ్మవార్లకు వెండి తొడుగులు (5.5 కిలోలు) ధరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మావూరి శ్రావణికి సత్కారం



వాయిస్ ఆఫ్ వరల్డ్ ఫేమ్ మావూరి శ్రావణిని సత్కరిస్తున్న వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మహిళలు యోగాసనాలు సాధన చేశారు. అనంతరం ప్రపంచ మ్యూజిక్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వాయిస్ ఆఫ్ వరల్డ్ ఫేమ్ మావూరి శ్రావణిని ఘనంగా సత్కరించారు. శ్రావణి ఆలపించిన సినీ గీతాలు అలరించాయి. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు ప్రభాశర్మ, ఉపాధ్యక్షులు ప్రభావతి, వినీల, కార్యదర్శి రోజారాణి, కోశాధికారి షీలారాణి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


దిశ పోలీసుల విచారణ



ఎన్ఏడీ జంక్షన్‌లో విచారణ చేస్తున్న దిశ డీఎస్పీ వివేకానంద్

గోపాలపట్నం: ఎన్ఏడీ ఫ్లై ఓవర్ బ్రిడ్జి దిగువన బాలికపై వృద్ధుడు లైంగికదాడికి యత్నించిన ఘటనపై దిశ పోలీస్ స్టేషన్ డీఎస్పీ వివేకానంద్ విచారణ చేపట్టారు. నాలుగేళ్ల బాలికపై 60 ఏళ్ల వృద్ధుడు లైంగికదాడికి యత్నించిన విషయం తెలిసిందే. ఈ కేసును ఎయిర్‌పోర్టు జోన్ పోలీసులు దిశ పోలీస్ స్టేషన్‌కు బదలాయించారు. దీంతో దిశ పోలీసులు విచారణ చేపట్టారు. ఈ మేరకు ఫిర్యాది రోజామణి సమక్షంలో స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేశామని, దర్యాప్తు చేస్తున్నామని వివేకానంద్ తెలిపారు.

ఏఎంసీ వార్షిక క్రీడాపోటీలు ప్రారంభం



త్రోబాల్ పోటీల్లో 2కే20 జట్టు తరఫున మద్ది సర్వ్‌ను ఎదుర్కొంటున్న 2కే22 జట్టు

విశాఖ స్పోర్ట్స్: పేస్–23 పేరిట నిర్వహిస్తున్న ఏఎంసీ వార్షిక క్రీడా పోటీలు బుధవారం మేజర్ ఎడ్విన్ స్మారక గ్రౌండ్‌లో ప్రారంభమయ్యాయి. ఏఎంసీ సెంటినరీ వేడుకల్లో భాగంగా జరుగుతున్న ఈ పోటీలను ఏఎంసీ ప్రిన్సిపాల్ జి.బుచ్చిరాజు ప్రారంభించారు. స్టూడెంట్స్‌కు క్రికెట్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, బాల్‌బ్యాడ్మింటన్, బ్యాడ్మింటన్, త్రోబాల్, టెన్నిస్, టీటీ, చెస్, క్యారమ్ పోటీలు, ఫ్యాకల్టీకి క్రికెట్, త్రోబాల్, చెస్, క్యారమ్, టీటీ, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నారు. పోటీలను పీడీ పాత్రుడు, నిర్వాహక ప్రతినిధులు కార్తీక్, హర్షిత, చెన్నకేశవ, శివసత్య పర్యవేక్షిస్తున్నారు. త్రోబాల్ ప్రారంభ పోటీలో 2కే20 బ్యాచ్ జట్టుతో 2కే22 బ్యాచ్ జట్టు తలపడింది. తొలిరోజు మెన్‌కు క్రికెట్, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు.

లలితానగర్‌లో కూలిన భారీ వృక్షం



లలితానగర్ సాక్షి రోడ్డులో కూలిన చెట్టు

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు లలితానగర్ 'సాక్షి' రోడ్డులో బుధవారం ఉదయం భారీ చెట్టు నేలకొరిగింది. వ్యాన్ ఢీకొట్టడంతో చెట్టు ఉన్నపళంగా కూలిపోయిందని స్థానికులు తెలిపారు. రోడ్డుకు అడ్డంగా చెట్టు కూలడంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. ఉదయం పెద్దగా జన సమచారం లేకపోవడంతో ఎవరికీ ఏమి జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. శంకరమఠం రోడ్డు నుంచి అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డుకు వెళ్లే వాహన చోదకులు వేరే రహదారులను ఆశ్రయించారు. ఉదయం కూలిన చెట్టు రాత్రి చీకటిపడినా తొలగించలేదని స్థానికులు అహసనం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి చెట్టు తరలించే ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

టెన్త్ టాపర్‌కు అభినందనలు



తేజను అభినందిస్తున్న స్కూల్ డైరెక్టర్లు

సీతంపేట: ఇటీవల విడుదలైన ఐసీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో 98.4 శాతం మార్కులు సాధించి టాపర్‌గా నిలిచిన దొగ్గ తేజను టింపనీ స్కూల్ యాజమాన్యం అభినందించింది. ఇంగ్లిష్ లిటరేచర్, హిస్టరీ అండ్ సివిక్స్, కంప్యూటర్ సైన్స్‌లో నూటికి నూరు శాతం మార్కులు, తెలుగులో 99 శాతం మార్కులు సాధించాడని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్లు, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు తేజను అభినందించి, ప్రశంసాపత్రం అందజేశారు. స్కూల్ అడ్వైజర్ నళినీ నెల్సన్ మాట్లాడుతూ ఈ ఏడాది టింపనీ స్కూల్ విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని చెప్పారు.

సమాజ పోకడలను ప్రతిబింబించేలా కథలు

సీతంపేట: సమాజ పోకడలను కథలు ప్రతిబింబించాలని రచయిత ఎస్.హనుమంతరావు అన్నారు. సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రిజమ్ కళాశాలలో కొత్త కథలు–22 సంకలనంపై జరిగిన చర్చా గోష్ఠిలో ఆయన మాట్లాడారు. యువ కథా రచయితలు వివిధ సామాజిక అంశాలను ఎంచుకుని చక్కని కథనంతో రాశారన్నారు. ఈ సంకలనంలో పెద్దింటి అశోక్‌కుమార్, ఉమా నూతక్కి, మస్ ప్రీతం, సుజాత వేల్పూరి, కుమార్ కూనపరాజు, ఖదీర్‌బాబు మున్నగు రచయితలు రాసిన కథలున్నాయని తెలిపారు. వర్తమాన సమాజ పోకడలను, కథా వస్తువులో భిన్నత్వం, శైలి, శిల్పాలపై ప్రత్యేక దృష్టి రచయితలకు ఉండాలని సూచించారు. కార్యక్రమంలో శేఖరమంత్రి ప్రభాకర్, కె.జి.వేణు, డి.వి.సూర్యారావు, కె.వి.ఎస్.మూర్తి, అడపా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రచయిత హనుమంతరావు

ఇండియన్ ఐడల్ సౌజన్యకు ఘన సన్మానం

సీతంపేట: ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ 30వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఇటీవల తెలుగు ఇండియన్ ఐడల్‌లో అద్భుతమైన గీతాలు పాడి ప్రథమ స్థానం కైవసం చేసుకున్న సౌజన్య భాగవతులను ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథి సినీ నటుడు కంచర్ల ఉపేంద్ర చేతుల మీదుగా సన్మానం జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్ననాటి నుంచి కర్ణాటక సంగీతంలో మంచి పట్టు ఉన్న సౌజన్య భాగవతుల తెలుగు, తమిళం, హిందీ భాషల్లో సినిమా పాటల ద్వారా ప్రేక్షకులకు చేరవయ్యారన్నారు. ఒకవైపు గాయనిగా రాణిస్తూ.. ఐటీ రంగంలో కూడా తనదైన ముద్ర వేశారని కొనియాడారు. ఈ సందర్భంగా ఓ సజీవ శిల్పం శీర్షికన నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, విశాఖ సంగీత కళాకారుల సంఘం గౌరవాధ్యక్షులు కొణతాల రాజు, గాయనీ గాయకులు పాల్గొన్నారు.



సౌజన్యను సత్కరిస్తున్న కంచర్ల తదితరులు

'4డీ డెర్మాడెన్' హబ్ ప్రారంభం

సీతంపేట: శంకరమఠం రోడ్‌లో కిన్నెర మెస్ పక్కన అనుధ్విస్ '4డీ డెర్మాడెన్' పేరుతో మల్టీ స్పెషలిటీ హబ్‌ను ఏర్పాటు చేశారు. దీనిని బుధవారం కార్తీక దీపం ఫేమ్, సినీ నటి అర్చన అనంత్ ముఖ్య అతిథిగా ప్రారంభించారు. ఇదే ఆస్పత్రిలో చర్మవ్యాధులు, చర్మ సంబంధింత సౌందర్య వైద్యానికి సంబంధించిన విభాగాన్ని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా అర్చన అనంత్ మాట్లాడుతూ తను స్వతహాగా బ్యూటీషియన్ కావడంతో ఈ కాస్మెటాలజీ హబ్‌ను ప్రారంభించడం ఆనందాన్ని ఉందన్నారు. డెర్మాడెన్ అధినేతలు డాక్టర్ అంబటి పృథ్వీరాజ్, డాక్టర్ అనూష మాట్లాడుతూ అత్యాధునిక పరికరాలతో చర్మం, తలకు సంబంధించిన వైద్యంతోపాటు దంతాలకు లేజర్ వైద్యం అందించడం మా హబ్ ప్రత్యేకతగా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫౌండర్, డైరెక్టర్ సుజాత డబ్బీరు, సినీ నిర్మాత నాగలింగం, బొడ్డేటి కిరణ్‌కుమార్, కొటక్కి మురళి పాల్గొన్నారు.



హబ్‌ను ప్రారంభిస్తున్న సినీ నటి అర్చన అనంత్

వైభవంగా నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేదికపై అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు ప్రసాదం, అక్షింతలు, శేషవస్త్రాలు అందజేశారు.

ఓపెన్ ఎయిర్ థియేటర్ సందర్శన

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆధునికీకరించిన ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను బుధవారం రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి సందర్శించారు. విశాఖకు విచ్చేసిన ఆయన ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డితో కలిసి వర్సిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. కళలకు నిలయంగా ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని నిలిపే దిశగా ఆరుబయలు రంగస్థలాన్ని పూర్తి స్థాయిలో ఆధునికీకరించామని వీసీ తెలిపారు. దీనిపై ఉన్నత విద్యా మండలి చైర్మన్ సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.



థియేటర్‌ను సందర్శిస్తున్న మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి

అత్తపై అల్లుడి దాడి

మల్కాపురం: అత్తపై అల్లుడు దాడి చేసిన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. మంతా సుధా అనే మహిళకు ఇద్దరు కుమార్తులు. చిన్న కుమార్తె ఆశదీప్తికి 13 ఏళ్ల కిందట గణేశ్వరరావు అనే బీఎస్ఎఫ్ కానిస్టేబుల్‌తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు. కొంతకాలంగా వీరి మధ్య సఖ్యత లేకపోవడంతో తరచూ గొడవలు జరుగుతుండేవి. దీంతో ఆశదీప్తి భర్తను విడిచి తన తల్లి దగ్గరకు వచ్చి ఉంటోంది. 2022లో భర్తపై ఆమె కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇంకా ఆ కేసు కోర్టులోనే ఉంది. బుధవారం గణేశ్వరరావు భార్య ఇంటికి వచ్చి గొడవ పడి సామగ్రి తీసుకెళ్లే క్రమంలో అత్త సుధ అడ్డు చెప్పడంతో ఆమెను ఒక్కసారిగా తోసివేశాడు. దీంతో ఆమె వ్యాన్ మీద పడిపోగా గాయాలయ్యాయి. సుధ ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.విజయ్‌కుమార్ నేతృత్వంలో కేసు దర్యాప్తు చేపట్టారు.

నేడు సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసీదళార్చన నిర్వహించనున్నారు. భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో రుసు చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తుల వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబర్‌ను 89855 15989కు వాట్సాప్ చేయాలి.

డిగ్రీ సబ్జెక్టులపై అవగాహన రేపు

దాబాగార్డెన్స్: జాతీయ విద్యా విధానం–2020 ప్రకారం డిగ్రీ కోర్సుల్లో ప్రవేశపెడుతున్న డిగ్రీ ఆనర్స్, సింగిల్ మేజర్ సబ్జెక్టులపై విద్యార్థులు, తల్లిదండ్రులకు ఈ నెల 23న డాబాగార్డెన్స్‌లోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఎస్‌సీహెచ్ఈ ఆదేశాల మేరకు ఆ రోజు ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమంలో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు పాల్గొని నాలుగు లేదా మూడేళ్ల డిగ్రీ కోర్సుల గురించి తెలుసుకోవచ్చని చెప్పారు.

860వ రోజుకు 'ఉక్కు' రిలే దీక్షలు



860వ రోజు దీక్ష శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: దేశంలోనే పెద్ద పరిశ్రమగా అవతరించిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అమ్మాలనుకోవడం దారుణమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. దీనిని అడ్డుకుని తీరతామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 860వ రోజు బుధవారం సంస్థలోని పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా కార్మికులు ప్రతిఘటిస్తారని, ఉక్కు పరిశ్రమలోని ఒక్క రేకును కూడా కదల్చలేరని వ్వరని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన నిరంకుశత్వ నిర్ణయాన్ని వదిలి, కార్మికులకు అండగా నిలబడాలని కోరారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగిస్తున్నట్లు ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

'రైజ్ ఆఫ్ ది ప్రౌడ్ ఇంట్రోవర్ట్స్' పుస్తకావిష్కరణ

సీతంపేట: నగరానికి చెందిన యువ రచయిత నిమ్మాని సంతోష్ రచించిన 'రైజ్ ఆఫ్ ది ప్రౌడ్ ఇంట్రోవర్ట్స్' పుస్తకావిష్కరణ సభ బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. ముఖ్య అతిథులు ఆర్ఎస్ఎస్ సంఘ్ చాలక్ పి.వి.నారాయణరావు, బీజేపీ కన్వీనర్ కొప్పల రామ్‌కుమార్, జీవీపీ కళాశాల డైరెక్టర్ డాక్టర్ రవిశంకర్ సరిపల్లే, విశాఖ స్టీల్‌ప్లాంట్ జీఎం కె.వి.రావు చేతుల మీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయిత సంతోష్ మాట్లాడుతూ ఇంట్రోవర్ట్స్ అంటే అంతర్ముఖులని, నిజ జీవితంలో మనం ఇలాంటి వారిని చూస్తుంటామన్నారు. ఎవరితో ఎక్కువగా మాట్లాడకుండా, జనాలకు దూరంగా, కలుపుగోలుతనం లేకుండా కొంతమంది మనకు తారసపడుతుంటారన్నారు. అటువంటి వారిని ఏ విధంగా మామూలు వ్యక్తులుగా మార్చుకోవాలి దానికి సంబంధించిన టెక్నిక్స్, ఎక్సర్‌సైజ్‌లు పుస్తకంలో పొందుపర్చినట్లు తెలిపారు. ఇది ప్రతి ఒక్కరూ చదవాల్సిన పుస్తకమని అతిథులు పేర్కొన్నారు. బుక్ మ్యాజిక్ లైబ్రరీ వ్యవస్థాపకుడు హరి మాదాల, పిక్ ఏ బుక్ సంస్థ ప్రతినిధికృష్ణకిరణ్ పుస్తకాన్ని సమీక్షించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

సమయపాలనకు ప్రాధాన్యం

మురళీనగర్: ప్రతి విద్యార్థి సమయపాలనకు ప్రాధాన్యమివ్వాలని న్యూరో లింగ్విస్టిక్స్ ప్రోగ్రాం మాస్టర్ ట్రైనర్(యు.ఎస్.ఎ.), రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ గెస్ట్ ఫ్యాకల్టీ, వ్యక్తిత్వ వికాస శిక్షణ నిపుణుడు ఎస్.వి.ఆర్. నాయుడు అన్నారు. సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ సి.నాగరాణి ఆదేశాల మేరకు విశాఖ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో పాలిసెట్ కౌన్సెలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులకు నిర్వహిస్తున్న ఓరియంటేషన్ కార్యక్రమంలో బుధవారం ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. స్టడీ స్కిల్స్ అండ్ టైం మేనేజ్‌మెంట్ పద్ధతులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సబ్జెక్టుల్లో నైపుణ్య సాధనకు కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఒక ప్రణాళిక ప్రకారం చదవడంతో పాటు నైపుణ్యాల సాధన, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై పట్టు సాధించాలన్నారు. తద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని వివరించారు. విద్యార్థులు అడిగిన పలు సందేహాలను ఎస్.వి.ఆర్.నాయుడు నివృత్తి చేశారు. కాలేజీ ప్రిన్సిపాల్ కె.డి.వి.నరసింహారావు, జనరల్ విభాగాధిపతి డాక్టర్ పి.ఎం.బాషా, ఇంగ్లిష్ సీనియర్ లెక్చరర్ డాక్టర్ కె.యమున, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ లెక్చరర్ ఎస్.నాగరాజు పాల్గొన్నారు.



విద్యార్థులకు టైమ్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్.వి.ఆర్.నాయుడు

పోలమాంబ కల్యాణ మండపం నిర్వహణకు వేలం

ఏయూక్యాంపస్: పెదవాల్తేరులోని శ్రీకరకచెట్టు పోలమాంబ ఆలయంలో ఉన్న కల్యాణ మండపం నిర్వహణకు వేలం పాట ప్రక్రియ చేపట్టారు. బుధవారం ఆలయంలో నిర్వహించిన బహిరంగ వేలం పాటలో రెండేళ్లకు వేలం వేయగా.. ఏడాదికి రూ.45.65 లక్షలకు నగరానికి చెందిన సింహాద్రి దక్కించుకున్నారు. రెండో ఏడాది పది శాతం అద్దెను పెంచనున్నారు. రెండేళ్ల కిందట వేలం వేయగా రూ.37.80 లక్షలకు వెళ్లింది. ఈ సారి రూ.7.85 లక్షలు అధికంగా వేలం పాట సాగింది. మొత్తం ఏడుగురు కల్యాణ మండపం కోసం పోటీ పడ్డారు. ఆలయ ప్రాంగణంలో షాపు నంబరు–1కు వేలం పాట నిర్వహించగా.. రూ.11,300కు దక్కించుకున్నారు. కల్యాణ మండపం నిర్వహణను జూలై 1 నుంచి నూతన కాంట్రాక్టర్‌కు అప్పగించనున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో డి.వి.ఎస్ సురేష్‌బాబా, ఆలయ చైర్మన్ పి.శంకర్‌రెడ్డి, ధర్మకర్తలు, పెదవాల్తేరు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.